క్లుప్తంగా

నేడు మండల సమావేశం

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ చేరెడ్డి సావిత్రి అధ్యక్షతన జరుగుతుందని మండల ఎంపీడీఓ రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డ్ సభ్యులు, మండల అధికారులు హాజరు కావాలని ఆయన తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : మండలంలోని జంభాపురం, పెద్దచెప్పలి సచివాలయాలలో సోమవారం నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని ఎంపీడీఓ చలపతి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు, ప్రజలు హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నేడు తిప్పిరెడ్డిపల్లె, రంపతాడుకు..

పెండ్లిమర్రి : మండలంలోని తిప్పిరెడ్డిపల్లెలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే రంపతాడు గ్రామంలో జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

విశ్వరూప మహాసభలను విజయవంతం చేయండి

జమ్మలమడుగు : హైదరాబాద్‌లో జరిగే విశ్వరూప మహాసభలను మాదిగలు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల కన్వీనర్ శివయ్య, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు పిచుకబాబు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో మాదిగలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్రంలో 8శాతం మంది ఉన్న మాదిగ, మాదిగ ఉపకులాలను అన్ని రాజకీయ పార్టీలు మోసం చేశాయని ఎస్సీ వర్గీకరణకు సహకరించని పార్టీలకు రాబోయే 2024 ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు లైసెన్సులు కలిగి ఉండాలి

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని వాహనదారులు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదు తెలిపారు. వాహనాలకు సంబంధించిన రికార్డులు, లైసెన్సులు తప్పకుండా వాహనంలో ఉంచుకోవాలన్నారు. అలాగే హెల్మెట్ ధరించాలన్నారు. అధిక లోడుతో ప్రయాణికులను ఎక్కించుకుని ప్రమాదాలకు కారకులు కావద్దన్నారు.

కల్వరి టెంపుల్ నిర్మాణాన్ని ఆపాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని లింగాపురం సమీపంలో నిర్మిస్తున్న కల్వరి టెంపుల్ పనులను ఆపాలని ప్రొద్దుటూరు పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ ఎస్.పీటర్ అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కల్వరి టెంపులో నిర్వాహకుడు సతీష్ కుమార్ ఎక్కడో ఉండి డిజిటల్ ప్రక్రియ ద్వారా ప్రజలను పోగేసుకుంటున్నారన్నారు. ఆయన బైబిల్ పేరుతో వ్యాపారం చేస్తూ తనకంటూ ఒక సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారని, బైబిల్ సిద్ధాంతానికి వ్యతిరేకంగా నడుచుకుంటూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయంపై ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు పాస్టర్స్ ఫెలోషిప్ కార్యదర్శి కృపాకుమార్, ట్రెజరర్ కేసీ డేవిడ్, పలు చర్చిల ఫాదర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రేపు నైమిశారణ్య పీఠాధిపతి రాక

చాపాడు : మండలంలో ముఖ్య పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి దేవస్థాన సన్నిధికి మంగళవారం హిందూ ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకులు శ్రీకాకుళం నైమిశారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి రానున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. వీరభద్ర స్వామి సన్నిధిలో ఉదయం 9 గంటలకు శ్రీ శివలీల విలాసం ప్రవచనాలు బోధిస్తారన్నారు. మండలంలోని వీరభద్ర స్వామి భక్తులందరూ హాజరుకావాలని ఆలయ ఈఓ కోరారు.

200 మందితో బైక్ ర్యాలీ

మైదుకూరు : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా ప్రొద్దుటూరులో ఏర్పాటు చేసిన రాయలసీమ జోనల్ సమావేశానికి మైదుకూరు నుంచి 200 బైకులతో బీజేపీ నాయకులు ర్యాలీగా వెళ్లారు. నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు మాచనూరు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఈ బైక్‌ర్యాలీ నిర్వహించారు. నరేంద్రమోదీ, పురందేశ్వరి నాయకత్వాన్ని బలపరచాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు.

మొదలైన మొహర్రం వేడుకలు

కాశినాయన : మండలంలోని అంబవరంలో మొహర్రం వేడుకలు గ్రామంలోని పెద్దపీరయ్యస్వామి పీర్లచావిడిలో నిర్వాహకుల ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. మొహర్రం సందర్భంగా 27వ తేదీన చిన్నసరిగెత్తు, 29వ తేదీన పెద్ద సరిగెత్తు, 30వ తేదీన పీర్లు బావికి వెళ్ళడంతో పీర్లపండుగ ముగుస్తుంది.

శివాలపల్లె ప్రజల కల సాకారం

చెన్నూరు : మండలంలోని శివాలపల్లె గ్రామ ప్రజల కల సాకారమైంది. శివాలపల్లి దళితవాడ నుంచి శివాలపల్లె మెయిన్ వరకు రూ.40 లక్షలతో సిమెంట్‌రోడ్డు నిర్మాణం పూర్తైంది. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలిపారు. గతంలో ఈ రోడ్డు చినుకు పడితే చిత్తడిగా మారేది. ఈ రోడ్డున వెళ్లాలంటే ప్రజలు నరకయాతన పడేవారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి రూ.40 లక్షల నిధులు మంజూరు చేయించడంతోపాటు శరవేగంగా రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయించాడు. దీంతో శివాలపల్లి, వల్లూరు మండలంలోని పలు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తీరినట్లు అయింది.

శివాలపల్లెకు వేసిన సీసీ రోడ్డు →



గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్ కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. అలాగే ఆలయ సమీపంలోని ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మతల్లిని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, నగర మేయర్ కె.సురేష్‌బాబులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏపీ మహిళా కమిషన్ మెంబర్ గజ్జల లక్ష్మీ ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు.



గంగమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రత్యేక అలంకరణలో అచ్చివెళ్లి గంగమ్మతల్లి

అచ్చివెళ్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని అచ్చివెళ్లి గ్రామ సమీపంలో వెలసిన అచ్చివెళ్లి గంగమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే గంగమ్మతల్లిగా ఎంతో ప్రసిద్ధి గాంచింది. కడప, కర్నూలు, అనంతపురం తదితర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు.

ఆదినిమ్మాయపల్లెలో నాకా బందీ

వల్లూరు : మండలంలోని ఆదినిమ్మాయపల్లెలో ఆదివారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఎస్‌ఐ పెద్దఓబన్న ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గ్రామంలో విస్తృతంగా తనిఖీలను నిర్వహించారు. గ్రామంలోని గృహాలు, ఖాళీ ప్రదేశాలు, కలాలలో క్షుణ్ణంగా సోదాలను చేపట్టారు. అనంతరం స్థానికులతో సమావేశాన్ని నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్న చిన్న విషయాలకు తగాదాలు పడి గొడవలకు పాల్పడి కేసుల పాలు కావద్దన్నారు. అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోలీసులకు తెలియచేయాలని సూచించారు.



కలంలో తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ పెద్దఓబన్న

కడప పార్లమెంటు కాపునాడు అధ్యక్షుడిగా రవి



ముద్దనూరు : కడప పార్లమెంటు నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడిగా ఆకుల రవికుమార్ నియమితులయ్యారు. మండలంలోని బొందలకుంట గ్రామానికి చెందిన తనను రాయలసీమ కాపునాడు జోన్ అధ్యక్షుడు వీరాంజనేయులు, జాతీయ కాపునాడు అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంలు నియమించారని, కాపు, బలిజ, ఒంటరి కులాల వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆకుల రవికుమార్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

పెండ్లిమర్రి : రైతులు పంటల సాగు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చునని రైతు సాధికార సంస్థ ప్రతినిధి డి.వి.రాముడు తెలిపారు. ఆదివారం మండలంలోని చెన్నంరాజుపల్లెలో ప్రకృతి వ్యవసాయంతో సాగుచేసిన పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. మహిళా సంఘాల్లో ఉన్న మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అడిషినల్ డీపీఎం వసుంతకుమారి, ఎన్ఎఫ్‌ఏ మేరి, సీనియర్ కన్సల్‌టెంట్ సురేంద్రరెడ్డి, రైతు గంగిరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని అధ్యాపకుడు సీహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం కడపలో రెండవరోజు నిర్వహించిన పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో ప్రభుత్వ విద్య– విద్యార్థుల కర్తవ్యాలు అనే అంశంపై బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం ద్వారా విద్యార్థుల్లో మనువాద భావజాలాన్ని ఎక్కిస్తున్నారన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ ఎం.రామక్రిష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు గనిరాజు సహాయ కార్యదర్శి అంకన్న, కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు వినోద్, సునీల్, జునైద్‌బాషా, కోశాధికారి జాకీర్, నాయకులు నాగరాజు, జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్ పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పులివెందుల రూరల్ : పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారని జిల్లా విజిలెన్స్ మానటరింగ్ కమీటి మెంబర్ కిషోర్ ఆదివారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పేదరికం సగం వరకు తగ్గిందని స్వయానా నీతి ఆయోగ్ తన నివేదికలో వెల్లడించిందన్నారు. 2016 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో 11.77 శాతం నిరుపేదలు ఉండగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వంలో 2021 డిసెంబర్ నాటికి పేదరికం 6.06 శాతానికి తగ్గిందన్నారు. సీఎం ప్రవేశపెట్టిన నవరత్నాల వల్ల పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్పీఎఫ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

ప్రొద్దుటూరు : విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25న నిర్వహించతలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వలరాజు, ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్ కోరారు. స్థానిక ఎస్సీ కళాశాల వసతి గృహంలో ఆదివారం బంద్‌కు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరిచారు.

ప్రాచీన యుద్ధ కళలు అంతరించిపోకుండా చూడాలి

బద్వేలు అర్బన్ : ప్రాచీన యుద్ధ కళలు అంతరించిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ప్రముఖ ధనుర్విద్య ఆచార్యులు ఉదయకుమార్ తెలిపారు. స్థానిక సరస్వతి శిశుమందిరంలో ప్రాచీన యుద్ధ కళలైన విలువిద్య, ఖడ్గవిద్య, దండవిద్య, శబ్దభేరి, ధ్యానం, యోగా శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. ప్రాచీన యుద్ధ కళలకు ఎంతో ప్రత్యేకత ఉందని, వీటిని సాధన చేయడం వలన గ్రహణశక్తి, మనోధైర్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయన్నారు. అంతేకాకుండా ఆత్మరక్షణకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సరస్వతి శిశుమందిరం ప్రధాన ఆచార్యులు తులసిశివానంద, కమిటీ సభ్యులు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ధనుర్విద్యలో శిక్షణ ఇస్తున్న ప్రముఖ ధనుర్విద్య ఆచార్యులు ఉదయకుమార్

నేడు గూడ్స్ వాహనం వేలం

రాజుపాళెం : రాజుపాళెం పోలీస్ స్టేషన్‌లో సోమవారం నాలుగు చక్రాల గూడ్స్ వాహనం వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ రాజగోపాల్ ఆదివారం తెలిపారు. ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు ఏఎస్పీ ప్రేరణకుమార్ పర్యవేక్షణలో వేలం నిర్వహించనున్నట్లు చెప్పారు.

దేశం గర్వించదగ్గ విద్యా ప్రదాత డాక్టర్ బీఎస్ రావు





బీఎస్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా– మాట్లాడుతున్న కడప మేయర్ సురేష్‌బాబు

కడప ఎడ్యుకేషన్: వైద్య వృత్తిని వదిలి విద్యారంగంలో సంచనాలను సృష్టించిన బీఎస్ రావు దేశం గర్వించదగ్గ విద్య ప్రదాత అని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాష, డిప్యూటీ మేయర్ సురేష్‌బాబు అన్నారు. ఆదివారం కడప నగరంలోని మాధవి కన్వెన్షన్‌హాల్‌లో బీఎస్‌రావు సంస్కరణ సభ శ్రీచైతన్య విద్యాసంస్థల రాయలసీమ ఏజీఎం దేరంగుల రమణయ్య అధ్యక్షతన ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ డాక్టర్ బొప్పన సత్యనారాయణరావు(బీఎస్ రావు) రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థులకు మేలిమి విద్యను అందిస్తూ విద్యారంగంలోనే సరికొత్త ఒరవడి సృష్టించారన్నారు. గుంటూరు జిల్లా అంగలూరు అనే చిన్న గ్రామంలో జన్మించిన బీఎస్ రావు లక్షలమంది విద్యార్థులను ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజనీర్లుగా తీర్చిదిద్దారని తెలిపారు. బీఎస్ రావు, ఆయన సతీమణి ఝాన్సీ ఇద్దరూ వైద్యులుగా ఇంగ్లాండ్, ఇరాన్, ఇరాక్‌లలో 12 ఏళ్ల వైద్య సేవలందించి తర్వాత విజయవాడకు వచ్చి విద్యాసంస్థలను ఏర్పాటు చేశారన్నారు. కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యాసంస్థలు విద్యార్థులను అన్ని విధాలుగా తీర్చిదిద్దుతూ వారి బంగారు భవిషత్తుకు బాటలు వేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ టీటీడీ పాలక మండలి సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు, విద్యా సంస్థల రాయలసీమ ఏజీఎం దేరంగుల రమణయ్య కూడా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నారాయణ, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రంగనాథరెడ్డి, చైతన్య కళాశాల డీఎన్ విజయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు నాగరాజు ఏఓలు మనోజ్‌రెడ్డి, మల్లికార్జున స్వామి, శ్రీచైతన్య స్కూల్స్ ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.



రూ.11 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించాడు

కమలాపురం 1వ వార్డు సచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తున్న ఖాదర్‌బాషా తన పరిధిలోని లబ్ధిదారుడు అల్లాబకష్‌కు రూ.11 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించడంలో కీలకపాత్ర పోషించాడు. అలాగే కోవిడ్ సమయంలో చేసిన సేవలు అభినందనీయం. ముఖ్యంగా 1వ సచివాలయం పరిధిలోని వలంటీర్లందరి వద్ద నుంచి రూ.1000 చొప్పున చందాలు వసూలు చేసి ప్రతి ఆదివారం భోజన పాకెట్లు సిద్ధం చేసి క్రాస్ రోడ్డు నుంచి గ్రామ చావడి వరకు ఉన్న దిక్కులేని వారికి భోజన పాకెట్లు పంపిణీ చేశాడు. అలాగే కోవిడ్ సమయంలో అతని పరిధిలోని అల్లాబకష్ అనే వ్యక్తి చెన్నై గ్లోబల్ హాస్పిటల్‌లో లీవర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్నాడు. చాలా ఖర్చు కావడంతో ఆ విషయం తెలుసుకున్న ఖాదర్‌బాషా స్థానిక ప్రజా ప్రతినిధులకు ఈ విషయం తెలియపరచి దాదాపు రూ.11 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించాడు.

– కమలాపురం



చెన్నై ఆసుపత్రిలో అల్లాబకష్‌తో వలంటీర్ ఖాదర్‌బాషా

బాషా సేవలు అభినందనీయం



వలంటీర్ ఖాదర్ బాషా సేవలు అభినందనీయం. నాకు ఆరోగ్యం సరిగా లేక చెన్నైలో చికిత్స పొందాను చాలా ఖర్చు అయింది. ఈ విషయం వాలంటీర్‌కు చెప్పాను. అతను స్పందించి స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి నాకు రూ.11 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ వచ్చేలా చేశాడు. అలాగే కోవిడ్ సమయంలో కూరగాయలు, సరుకులు అన్ని తెచ్చి ఇచ్చేవాడు. కోవిడ్ బారిన పడకుండా మాకు జాగ్రత్తలు చెప్పేవాడు. **– అల్లాబకష్, కమలాపురం**

ఒక కుటుంబ సభ్యురాలిగా...



ఎర్రగుంట్ల మండలంలోని మాలెపాడు వలంటీర్‌గా గుళ్లదుర్తి గంగామహేశ్వరి సేవలిందిస్తోంది. జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్నో సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందజేసింది. తెల్లవారకముందే ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు అందజేస్తుంది. కుటుంబ సభ్యురాలిగా వారికి ఏ పని కావాలన్నా చేసి పెడుతుంది. గతంలో కరోనా సమయంలో కూడా ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేసింది. **– ఎర్రగుంట్ల.**

మనవరాలిలాగా సేవలు చేసింది..

మా వలంటీర్ గంగామహేశ్వరీ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇస్తుంది. ఏ అవసరం వచ్చినా నేనున్నంటూ పనులు చేసిపెడుతుంది. వలంటీర్ వచ్చినప్పటి నుంచి నాకు ఎన్నోపనులు ఇంటివద్ద నుంచే జరిగియి. మనవరాలిలాగా పనిచేసిపెట్టేది. గతంలో కార్యాలయాల చుట్టు తిరిగి అలసి పోయేదాన్ని ప్రస్తుతం ప్రతి నెల నిద్ర లేచి పింఛన్ సొమ్మును ఇస్తుంది.

– గుర్రమ్మ మాలెపాడు గ్రామం, ఎర్రగుంట్ల.

బంధువులా ఆదుకున్నాడు

ఇతని పేరు వేమా రామకృష్ణ, వేంపల్లెలో 11వ వార్డులో వలంటీర్‌గా సేవలందిస్తున్నారు. గత నాలుగేళ్లుగా జగనన్న ప్రభుత్వం అమలు చేసిన ఎన్నో సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు దరి చేర్చాడు. తెల్లవారకముందే ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు అందిస్తున్నాడు. కుటుంబ సభ్యుడిలా వారికి ఏ పని కావాలన్నా చేసి పెడుతున్నాడు. గతంలో కరోనా మహమ్మారి వ్యాపించిన సమయంలోనూ ఇంటింటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేసి వృద్ధుల దీవెనలు పొందాడు. **– వేంపల్లె**

సుబ్బలక్షుమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ రామకృష్ణ



మంచిగా సేవలు చేస్తున్నాడు..



నాపేరు బొడ్డు సుబ్బలక్షుమ్మ, నేను వేంపల్లెలో 11వ వార్డులో నివాసముంటున్నాను. మా వలంటీర్ వేమా రామకృష్ణ నాకు ఇంటి వద్దకు వచ్చి పింఛన్ ఇస్తున్నాడు. ఏ అవసరం వచ్చినా నేనున్నానంటూ వచ్చి పనులు చేసి పెడుతున్నాడు. గతంలో కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయేదాన్ని, ఒక్కోసారి నెలలో మూడు రోజులపాటు కార్యాలయాలపాటు తిరిగే పరిస్థితి ఉండేది. ఆరోగ్యం సరిగా లేకపోయినా 104 వాహనం వద్దకు తీసుకెళ్లి వైద్యం చేయించి మందులు ఇప్పిస్తున్నాడు. **– బొడ్డు సుబ్బలక్షుమ్మ, వేంపల్లె**

నిజాయితీగా సేవలు

పులివెందుల నగరిగుట్టకు చెందిన వలంటీర్ లక్ష్మీదేవి తనకు కేటాయించిన 50 ఇళ్లల్లో అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ వారికి సేవలు అందిస్తోంది. కరోనా సమయంలో ధైర్యంగా ఇంటికి వెళ్లి తన పరిధిలోని లబ్ధిదారులకు వృద్ధులకు, వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేయడంతోపాటు వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అవసరమైన వారికి తన సహాయ సహకారం అందిస్తోంది. ఏ సమస్య వచ్చినా కుటుంబ సభ్యులుగా వచ్చి సేవలందిస్తోంది.

– పులివెందుల రూరల్



తోబుట్టువులా చూసుకుంటోంది..



ప్రభుత్వం అందించే పింఛన్లు ప్రతినెలా 1వ తేదీన ఇంటికి వచ్చి రూ.2,750లు అందిస్తోంది. ఏమి అవసరం వచ్చినా మా వలంటీర్ లక్ష్మీదేవి తోబుట్టువులా ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు తెలుసుకుంటుంది. గతంలో పింఛన్ల కోసం చదువురాని మేము కార్యాలయం చుట్టూ తిరిగి ఇబ్బందులు పడేవాళ్లం. అలాంటిది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయవల్ల ఇంటికి వచ్చి మాకు పింఛన్లు ఇస్తున్నారు. **– శేఖర్(స్థానికుడు), నగరిగుట్ట, పులివెందుల**

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 12వ తేదీన గుంటూరులో జరుగుతాయని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు అందరూ అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కో చైర్మన్ లెక్కల జమాల్‌రెడ్డి, ఉమ్మడి కడపజిల్లా చైర్మన్ మోపూరు శివారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కడప పీఆర్‌టీయూ కార్యాలయంలో ఉమ్మడి కడప జిల్లా ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కార్యవర్గ సమావేశాన్ని జిల్లా చైర్మన్ శివారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కో చైర్మన్ లెక్కల జమాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ స్థాపించి ఐదేళ్లకాలంలో ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల అనేక సమస్యలు పరిష్కరించిందన్నారు. ముఖ్యంగా ఎంపీడీవోలకు పదోన్నతులు, వీఆర్ఏ, ఏఆర్వోలకు ప్రమోషన్లు, పాలిటెక్నికల్ అధ్యాపకులకు పీఆర్‌సీ ఇప్పించామన్నారు. 1998, 2008 డీఎస్సీ వారికి పోస్టులను ఇప్పించిన ఘనత తమకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ మోపూరు శివారెడ్డి, ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బోరెడ్డి వరదారెడ్డి, జిల్లా కో చైర్మన్ పల్లెం సుబ్బారెడ్డి, వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సజ్జల రమణారెడ్డి, ఎన్‌సీసీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారెడ్డి, జూనియర్ లెక్చరర్స్‌అసోసియేషన్ అధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి, ఏపీటీజీ అసోసియేషన్ అధ్యక్షుడు బాలశౌరిరెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ గుజ్జల తిరుపాల్, ఎస్‌ఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరావు, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జమాల్‌రెడ్డి